24092024-DIS-06_Layout 1 9/24/2024 2:10 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# శ్రీలంకలో కొత్తగాలి

**ఆర్థిక సంక్షోభంలో** కొట్టుమిట్టాడుతున్న శ్రీలంకలో సరికొత్త రాజకీయ గాలి వీస్తున్నది. తాజాగా జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ప్రజలు పాత పార్టీలను తిరస్కరించి నూతన రాజకీయ శక్తులకు పట్టం గట్టారు. ఉత్కంఠభరితంగా సాగిన అధ్యక్ష ఎన్నికల్లో కమ్యూనిస్టు నేత అనూరకుమార దిస్సనాయకే (క్లుప్తంగా ఏకేడీ) విజయం సాధించడం ఎగుడుదిగుడుగా సాగుతున్న ద్వీప దేశ రాజకీయాల్లో సరికొత్త మలుపు అనే చెప్పాలి. ఇన్నాళ్లూ దేశంపై పెత్తనం సాగించిన జాతీయవాద పార్టీలు ప్రాబల్యం కోల్పోవడాన్ని ఇది సూచిస్తున్నది. శ్రీలంక స్వాతంత్ర్యం పొందిన తర్వాత ప్రధాన పక్షాలైన శ్రీలంక ఫ్రీడం పార్టీ (ఎస్ఎల్ఎఫ్‌పీ), యునైటెడ్ నేషనల్ పార్టీ (యూఎన్‌పీ)లు, వాటి అంతే వాసీలు కాకుండా మూడో పార్టీ తొలిసారిగా అధ్యక్ష పదవిని కైవసం చేసుకున్నది. జనతా విముక్తి పెరమున (జేవీపీ) నాయకుడైన దిస్సనాయకే దేశ పగ్గాలు అందుకున్నారు. అయితే ఇది అంత సులభంగా జరగలేదు. హోరాహోరీ ఎన్నికల పోటీలో తొలి విడత ఓట్ల లెక్కింపులో ఏ ఒక్కరికీ మెజారిటీ (51 శాతం ఓట్లు) రాకపోవడంతో ద్వితీయ ప్రాధాన్యం ఓట్ల లెక్కింపు చేపట్టాల్సి వచ్చింది. ఇది కూడా శ్రీలంక చరిత్రలో కనీవినీ ఎరుగని విషయమే. అంతిమ విజేతగా దిస్సనాయకే నిలువగా, మరో విపక్ష అభ్యర్థి సాజిత్ ప్రేమదాస రెండోస్థానంలో, అధ్యక్ష పదవి నుంచి దిగిపోతున్న రనిల్ విక్రమసింఘే మూడో స్థానంలో నిలిచారు.

అవినీతిని అంతం చేయడం, జాతి దురహంకారాన్ని రూపుమాపడం, రాజకీయ సంస్కృతిని సమూలంగా మార్చివేయడం తన ప్రథమ కర్తవ్యాలుగా ఉంటాయని ఏకేడీ తన తొలిస్పందనలో వెల్లడించారు. సింహళ, తమిళ, ముస్లిం వర్గాలుగా విడిపోయిన శ్రీలంక సమాజాన్ని ఒకేతాటి మీదకు తేవడం ఆహ్వానించదగినదే. ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి ఈతిబాధల నుంచి ప్రజలను విముక్తులను చేయడమూ అత్యవసరమే. ప్రజలు తక్షణ ఉపశమనం కోరుకుంటున్నారని ఎన్నికల ఫలితాలు విస్పష్టంగా తెలియజేశాయి. అయితే ఏకేడీ ఎన్నికతో రాజకీయ సుస్థిరత ఏర్పడిందని భావించలేం. ఆయన నేతృత్వంలోని జేవీపీకి పార్లమెంటులో మూడే స్థానాలున్నాయి. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జేవీపీ బలం పుంజుకోగలిగితేనే ఏకేడీ అధికారం సుస్థిరమవుతుంది.

శ్రీలంక-భారత్ సంబంధాలు ఈలం వేర్పాటువాద ఉద్యమకాలం నుంచీ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాయి. ఇటీవలి కాలంలో అదానీ సంస్థతో విద్యుత్తు ఒప్పందం కారణంగా రెండు దేశాల మధ్య దూరం ఏర్పడిన సంగతి తెలిసిందే. నూతన అధ్యక్షుడిగా పగ్గాలు చేపడుతున్న ఏకేడీకి చైనా అనుకూలుడిగా పేరుంది. ఆయన చైనా వైపు మరింతగా మొగ్గితే ఆ దూరం మరింతగా పెరుగవచ్చు. చైనా ఉక్కు కౌగిలిలోకి ఒదిగిపోతున్న పొరుగు దేశాలతో సంబంధాలు మెరుగుపర్చుకోవడం భారత్‌కు పెను సవాల్‌గా మారింది. భారత్ చుట్టూ ఉన్న పొరుగు దేశాలు ఒక్కటొక్కటిగా చైనా ప్రభావ పరిధిలోకి వెళ్తుండటం మనం చూస్తున్నాం. నేపాల్, మాల్దీవులు, బంగ్లాదేశ్ ఈసరికే చైనా ఉచ్చులోకి వెళ్లాయి. తాజాగా శ్రీలంక ఆ జాబితాలోకి చేరిపోయింది. అధ్యక్షునిగా ఏకేడీ ఎన్నిక ఓ ముక్తాయింపు మాత్రమే.

# పాఠాలు నేర్వాదా కాంగ్రెస్?

**కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు, ఆరోపణలు నానాటికి వెల్లువెత్తుతున్నాయి. విమర్శలు హామీల అమలు, పరిపాలన విషయంలో. ఆరోపణలు అవినీతికి సంబంధించి. అయితే వాటిని ప్రస్తుతానికి పక్కన ఉంచుదాము. కాంగ్రెస్ పార్టీకి, ఆ ప్రభుత్వానికి మేలు జరగటం, లేదా హాని కలగటం అనే దృక్కోణం నుంచి చూసినప్పుడు, అంతకన్న ముఖ్యంగా చెప్పుకోవలసిన విషయం ఒకటున్నది. అది, వారు తమ గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటున్నారా లేదా అన్నది. ప్రస్తుత ధోరణిని జాగ్రత్తగా గమనించినప్పుడు, తెలంగాణ రాష్ట్రంలోనే కాదు, జాతీయ స్థాయిలోనూ వారు తమ చరిత్ర నుంచి ఎటువంటి పాఠాలు నేర్చుకుంటున్న సూచనలు కనిపించటం లేదు. దాన్ని బట్టి, గత అధికార భ్రష్టత్వాలకు వలెనే మరొక మారు పతనానికి పరిస్థితులను తమకు తామే సిద్ధం చేసుకుంటున్నారనే అభిప్రాయం కలుగుతున్నది.**



టంకశాల అశోక్



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు వచ్చేముందు జాతీయ పరిణామాలను చెప్పుకుందాం. ఎందుకంటే, మొదట ఉమ్మడి రాష్ట్రంలో గాని, తర్వాత తెలంగాణలో గాని మనం చూస్తున్న కాంగ్రెస్ పతన క్రమానికి మూలాలు జాతీయ పరిణామాలలో ఉన్నాయి. అవి అర్థం చేసుకుంటే గానీ ఇవి అర్థం కావు. జాతీయస్థాయిలో కాంగ్రెస్ స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించి అన్నివర్గాల ప్రజలను వెంట తీసుకుపోయింది. స్వాతంత్ర్యం తర్వాత, అన్నివర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి, వారి ఆకాంక్షల పరిపూర్తికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఒక గొప్ప రాజ్యాంగాన్ని రూపొందించింది. కానీ వారి పరిపాలన అవన్నీ నిజాయితీ రహితంగా, అరకొరగా అమలవుతూ సాగటంతో మొదలైంది. ఆ వివరాల్లోకి ఇక్కడ వెళ్లలేము గాని, ఆ విధంగా మొదటనే కనిపించిన వైఫల్యాలూ, అందుకు తగిన వ్యతిరేక ఫలితాలు కూడా ఆరంభంలోనే మొదలయ్యాయని గుర్తించాలి. ఆ తొలి దశలో కనిపించిన అటువంటి స్థితే, అప్పటినుంచి 70 సుదీర్ఘ సంవత్సరాల తర్వాత ఇప్పటికీ ఉందన్నది ఇక్కడ మాట్లాడుకుంటున్న ప్రధాన విషయం. ఇది జాతీయస్థాయి నుంచి తెలంగాణ వరకు కూడా. అదెట్లాగో చూద్దాం.

కాంగ్రెస్ తొలి ప్రధాని అయిన నెహ్రూ ఒక దార్శనికుడు, చిత్తశుద్ధి గలవాడనటంలో సందేహం లేదు. ఆయన తన 17 ఏండ్ల పాలనలో దేశ అవసరాలకు అనుగుణంగా, రాజ్యాంగాన్ని అనుసరించి అనేక చర్యలు తీసుకున్నారు. వాటిలో అనేకం విఫలమయ్యాయి, లేదా అరకొరగా సాగాయి. అందుకు కారణం ఏమిటన్నది మాత్రం ప్రచారం కాలేదు, ప్రజల దృష్టికి రాలేదు. అందుకు కారకులు కాంగ్రెస్‌లో జాతీయస్థాయి నుంచి రాష్ట్రాల వరకు గల కన్జర్వేటివ్ వర్గాలు, ఫ్యూడల్ వర్గాలు, అధికార యంత్రాంగంలోని ఒక వర్గం, విదేశీ పెట్టుబడిదారీ లాబీలు. అందువల్ల ఏమి జరిగింది, నెహ్రూ తర్వాత ఈ శక్తుల ప్రాబల్యం ఎట్లా పనిచేసిందనే చర్చ ప్రస్తుతం చేయలేము గాని, ఈ ప్రారంభ దశలోనే తదనంతర కాలంలో కాంగ్రెస్ వైఫల్యాలకు బీజాలు పడ్డాయని మాత్రం గుర్తించాలి.

ఆ వైఫల్యాల ఫలితాన్ని కాంగ్రెస్ పార్టీ నెహ్రూ కాలంలోనే చవిచూసింది కూడా. 1952 మొదటి ఎన్నికల తర్వాత 1957లో రెండవ ఎన్నికల నాటికే కాంగ్రెస్ పార్టీ యూపీ, బీహార్, బెంగాల్, అస్సాం, ఒరిస్సా వంటి పెద్ద రాష్ట్రాలలో, ఓట్లు, సీట్లతో పాటు, కేరళలోనైతే ఏకంగా అధికారాన్నే పోగొట్టుకుంది. అందుకు కారణాలు పార్టీలోని ఇతర నాయకులకు కాకున్నా నెహ్రూకు బాగానే అర్థమయ్యాయి. బడుగు, బలహీనుల సమస్యలను పరిష్కరించనట్టయితే, వారు తమ చేతికి అందిన ఓటు ఆయుధంతో మనలను శిక్షిస్తారని, అదేవిధంగా మనలను పక్కకు తోసివేసి తమ దారి తాము వెతుక్కుంటూ ముందుకుపోతారని, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలోనే మాట్లాడుతూ హెచ్చరించారాయన. మాటలు సరిగా ఇవేకాకున్నా సారాంశం ఇది. నిజానికి ఈ స్థితిని 1952 మొదటి ఎన్నికల కన్నా ముందే అప్పటి ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఊహిస్తూ నెహ్రూకు ఒక లేఖ రాశారు. ఆయన ముఖ్యంగా ఎత్తిచూపింది కాంగ్రెస్‌లో అప్పటికే మొదలైన అవినీతి ధోరణుల గురించి. అవి అట్లాగే సాగితే కాంగ్రెస్ నష్టపోతుందని కూడా అన్నారు.

**విషయమేమంటే, ఆ విధమైన రాధాకృష్ణన్, నెహ్రూల హెచ్చరికల నుంచి కాంగ్రెస్ వాదులు గాని, వారి వివిధ ప్రభుత్వాలు గాని, ఆ 1950ల కాలం మొదలు ఈ 2024 వరకు 70 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎటువంటి పాఠాలు నేర్వలేదు. ప్రజలకు మాయమాటలు చెప్పటం, పాప్యులిజంతో మభ్యపెట్టడం, ఓట్లను అమ్ముకునేందుకు ప్రజలను అలవాటు చేయటం, ఒక ఎన్నిక నుంచి మరొక ఎన్నికకు అలవికాని హామీలనివ్వటం, తమ వైఫల్యాలను యథావిధిగా కొనసాగిస్తూ, అధికారాన్ని అనుభవిస్తూ, అవినీతిని విచ్చలవిడిగా సాగించటం అనే పద్ధతులకు అలవాటుపడిపోయారు. కొద్దిపాటి తేడాలతో ఇదే సాగుతూ వస్తున్నది జాతీయస్థాయిలో, రాష్ట్రాలలో కూడా అయినా వారు పాఠాలు నేర్వలేదు. నేటికీ నేర్వటం లేదు. తెలంగాణలో సైతం ప్రస్తుతం అదే కనిపిస్తున్నది.**

ఇందుకు ఫలితాన్ని వారు మొదటిసారి 1957లోనే ఎదుర్కొనగా, తర్వాత అది మరింత తీవ్రమై అనేక ఒడిదుడుకులను అనుభవించారు. ఆ విషయాలు క్లుప్తంగా చూద్దాము. కేంద్రంలో సొంత మెజారిటీతో కాంగ్రెస్ వరుసగా పాలించింది 1977 వరకు మాత్రమే. తర్వాత కాలంలో జరిగిందంతా మధ్య మధ్య అధికారానికి రావటం, లేదా ఇతర పార్టీల పొత్తుతో రావటం. అనగా తన ఎదురులేని ఏకచ్ఛత్రాధిపత్యం ఇప్పటికి 47 సంవత్సరాల క్రితం 1977లోనే భంగపడింది. అప్పటినుంచి పలుమార్లు కేంద్రంలో అధికారం కోల్పోయింది. ప్రస్తుతానికి వస్తే, 2004, 2009లో రెండు సార్లు కూటమి రూపంలో మాత్రమే పాలించిన తర్వాత, 2014 నుంచి ఇప్పటికి వరుసగా మూడు సార్లు గెలవలేకపోయింది. అంతేకాదు, తన చరిత్రలోనే ఎన్నడూ లేనంత తక్కువ సీట్లు తెచ్చుకున్న మూడుసార్లు కూడా ఇవే. ఇక రాష్ట్రాలను చూస్తే, కాంగ్రెస్ ఆధిపత్యం కేంద్రం కన్నా (1977) పది సంవత్సరాల (1967) ముందే భంగపడింది. ఆ దుస్థితి నుంచి, పతన పరంపర నుంచి ఆ పార్టీ నేటికీ కోలుకోలేదు. కనుక ఈ రోజున దేశంలోని 28 రాష్ట్రాలలో కేవలం మూడే మూడింట అధికారంలో మిగిలింది. అయినప్పటికీ పాఠాలు నేర్చుకొని ఒక సమగ్రమైన అజెండాను తయారుచేసుకోవటం, పార్టీని క్రమపద్ధతిలో నిర్మించుకోవటానికి బదులు హంగామా డైలాగులు, నాటకీయతలతోనే మురిసిపోతున్నారు.


ఈ చర్చ అంతటిలో చెప్పదలచిన రెండు ప్రధానమైన అంశాలు ఏమంటే, ఒకటి, కాంగ్రెస్ పార్టీ గాని, ప్రభుత్వాలు గానీ, గత 77 సంవత్సరాల సుదీర్ఘకాలంలో తమ వైఫల్యాలను సరిదిద్దుకోలేదు. అవినీతిని, బంధుప్రీతిని నిరోధించుకోలేదు. అంతిమంగా ఎటువంటి పాఠాలు నేర్చుకోలేదు. దీని ప్రభావం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కనిపించింది, తెలంగాణలో కనిపిస్తున్నది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడగా వారి ఎదురులేని పాలన 30 ఏండ్లు గడవకముందే 1983లో ఎన్టీఆర్ నాయకత్వాన ఒక ఫెడరల్ పార్టీ రాకతో ముగిసింది. అప్పటి నుంచి 2014లో రాష్ట్ర విభజన వరకు వారి అధికారానికి ఐదు సార్లు అంతరాయాలు ఏర్పడ్డాయి. మరొక విభజిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం మూడుసార్లూ ఫెడరల్ పార్టీలే గెలిచాయి. తెలంగాణలో రెండు సార్లు ఓడి ఒకసారి గెలిచారు.

ఈ మొత్తం కాంగ్రెస్ చరిత్రలో పైన చెప్పుకున్న పరిపాలనా వైఫల్యాలు, పాఠాలు నేర్వకపోవటం, విచ్చలవిడి అవినీతి అనే మూడు లక్షణాలతో పాటు, గమనించదగిన మరో రెండు విషయాలున్నాయి. ఒకటి, కాంగ్రెస్‌వాదులు సుమారు 1990ల వరకు జయాపజయాలతో నిమిత్తం లేకుండా తమ పార్టీకి కట్టుబడి ఉండేవారు. ఆయారాం గయారాంలు ఉండినా తక్కువే. అటువంటి వారికి అదొక మచ్చగా కూడా ఉండేది. పార్టీ వాదులకు పార్టీ పరమైన సిద్ధాంతాలపై నమ్మకం, నాయకత్వం పట్ల విధేయతలు ఉండేవి. ఒకసారి ఓడినా మరోసారి గెలవగలమనుకునేవారు. గమనించవలసిన రెండు విషయాలలో ఇది ఒకటి కాగా, తర్వాత కాలంలో వివిధ కారణాల వల్ల పార్టీ సిద్ధాంతాలపై నమ్మకాలు, నాయకత్వాల పట్ల విధేయతలు సడలిపోవటం ఒక ధోరణిగా మారింది. ఒకవైపు పార్టీ బలహీనపడటం, గెలుపు అనుమానాస్పదం అవుతుండటం, మరొకవైపు నాయకులకు, శ్రేణులకు వ్యక్తిగత అధికార ప్రయోజనాలు, ఆర్థిక ప్రయోజనాలు పెరుగుతుండటం వంటి వాటితో అసలు రాజకీయరంగమే ఒక ఫ్రీ మార్కెట్‌గా మారింది. కాంగ్రెస్ అందుకు మినహాయింపు కాలేదు. రాజకీయ వాదులు, వారి అనుచరులు, చివరికి సాధారణ కార్యకర్తలు కూడా ఇదే ధర్మాన్ని అనుసరించే రెండవ దశ మొదలైంది. కాంగ్రెస్ గెలిస్తే అందులోకి వస్తారు, ఓడితే మరో పార్టీలోకి పోతారు. అంతా రంగులరాట్నం తీరు.

ఈ పరిణామాల నుంచి, స్వయంగా తన అనుభవాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ ఏ పాఠాలు నేర్చుకోని ఈ స్థితే ఈ రోజున తెలంగాణలోనూ కన్పిస్తున్నది. పరిస్థితి సారాంశాన్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే, హామీల అమలులో తీవ్ర వైఫల్యం, దానిని కప్పిపుచ్చుకునే మాయ మాటలూ, చేష్టలు, క్రమంగా విచ్చలవిడిస్థాయికి చేరుతున్న అవినీతి, పరిపాలనా వైఫల్యాలు, అంతిమంగా 77 సంవత్సరాల అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకపోవటం. ఆ విధంగా వారు రాగల కాలంలో తమ పతనానికి తామే మరొకసారి బాటలు వేసుకుంటున్నారు. ఆ స్థితిని నెహ్రూ అంతటివాడే ప్రయత్నించి కూడా సరిదిద్దలేకపోయినప్పుడు, ప్రస్తుతం అసలు అటువంటి ఆలోచన గలవారే లేనప్పుడు, ఇక చెప్పేదేమున్నది!

ఎవరైనా సరే ఒకసారి కాంగ్రెస్ మ్యానిఫెస్టోను, వారు బాండ్ పేపర్లపై సంతకాలు చేసి ఇంటింటికి తిరిగి పంచిన ఆరు గ్యారంటీలను చూడండి. ఆ గ్యారంటీలలో వారన్న 100 రోజులలో గానీ, ఇప్పటికి గడిచిన 260 రోజులలో గాని ఏవి అమలయ్యాయో, ఏవి కాలేదో తమంతట తామే పోల్చిచూసుకోండి. అమలు కావటం లేదా కాకపోవటంపై ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ఏమి అంటున్నారు, ఏమి అనటం లేదు, ఏవి దాస్తున్నారు, ఏవి వంకరటింకర తిప్పి మాట్లాడుతున్నారు అనేవి మీ అంతట మీరే గమనించండి. ఎవరూ చెప్పనక్కరలేదు. అట్లాగే, మ్యానిఫెస్టోలో ఏమి చెప్పి తర్వాత ఏమంటున్నారనేది కూడా. మరొకవైపు ఈ అంశాలపై ఏ సవాలుకూ జవాబివ్వకపోవటాన్ని అందరూ ఇప్పటికే గమనించి ఉంటారు. కొత్తగా ఒక ఉద్యోగమైనా ఇచ్చినట్లు రుజువు చేస్తే అసెంబ్లీ నుంచే గాక రాజకీయాల నుంచే తప్పుకుంటానని కేటీఆర్ పలుమార్లు సవాలు చేసినా జవాబుండదు. రుణమాఫీ అందరికీ జరిగిందని నిరూపిస్తే తాను కూడా అదే పని చేయగలనన్న హరీశ్‌రావు సవాలుకు స్పందన ఉండదు. ఇటువంటివి మరెన్నో. తాజాగా, కేంద్ర ప్రభుత్వ పథకమైన 'అమృత్' అమలులో అవినీతి లేదని జ్యుడీషియల్ విచారణలో తేలితే తాను రాజకీయ సన్యాసం తీసుకోగలనని కేటీఆర్ అన్నారు. ఈ వ్యాసం రాసే సమయానికైతే అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి ఎటువంటి ఉలుకూ పలుకూ లేదు.

హామీల అమలు, అవినీతి, పరిపాలన సక్రమంగా సాగకపోవటంపై ఇప్పటికే ప్రజలలో మాటలు మొదలయ్యాయి. దాని అర్థం, పైన వివరంగా చర్చించుకున్నట్లు కాంగ్రెస్ వారు గత 77 సంవత్సరాలుగా నేర్చుకోని పాఠాలను ఇప్పటికీ నేర్చుకోవటం లేదు. తమ జాతీయ నాయకత్వం అయినా వారికి నేర్పటం లేదు. నిజం చెప్పాలంటే వారు నేర్పరు, నేర్పలేరు కూడా. ఎందుకంటే వారు స్వయంగా నేర్చుకోలేదు, నేర్చుకోవటం లేదు గనుక.






## మేం మళ్లీ రావడమా?

దేశంలో మా పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చి నాలుగోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే గ్యారంటీ లేదు. కానీ, రామ్‌దాస్ అథవాలే కచ్చితంగా మళ్లీ కేంద్ర మంత్రి అవుతారని మాత్రం నేను గ్యారంటీ ఇవ్వగలను.

- నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రి

*దేహాన్ని ఆయుధంగా చేసి..!*
*ఆయువును ఇంధనంగా మలచి..!*
*యంత్రాలను మిత్రులుగా మార్చి..!*
*ప్రాణాలను పణంగా పెట్టి..*
*చెమటోడ్చి, శ్రమించి..!*
*నల్ల బంగారాన్ని వెలికితీసి..!*
*సింగరేణిని సిరుల గనిగా తీర్చిదిద్దిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది.*
*లోకానికి వెలుగును పంచే నల్ల సూరీళ్ల నాశనానికి పూనుకున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.*

*సింగరేణి నల్ల బంగారం.. తెలంగాణ కొంగు బంగారం సింగరేణిని బొంద పెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసే కుట్రలు చేస్తున్నాయి. 130 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థను కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలనే కుట్రతో పోయిన ఏడాది బెంగళూరులో ఇన్వెస్టర్ల భేటీలో 4 సింగరేణి బొగ్గు బ్లాకులను అధికారికంగా వేలం వేసిన నాటి నుంచి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి లాభాల్లో కార్మికుల వాటా తగ్గించి, తద్వారా ఆత్మ స్థయిర్యాన్ని దెబ్బకొట్టి, వారి భాగస్వామ్యం లేకుండా చేసి, సింగరేణిని ప్రైవేటీకరించే కుట్రలకు మద్దతుగా నిలుస్తున్నది.*

# సింగరేణిలో శ్రమ దోపిడి



బాల్క సుమన్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటితే చేతలు గడప దాటవనే విషయం సింగరేణి కార్మికుల విషయంలో మరోసారి రుజువైంది. దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు తీపి కబురు బదులు చేదు కబురు చెప్పారు. సంస్థ గడించిన లాభాల ఆధారంగా కార్మికులకు ఇచ్చే బోనస్‌ను కూడా బోగస్ చేశారు. ఈ ఏడాది అంటే 2023-24కు వచ్చిన లాభాలు రూ.4701 కోట్లు కాగా ప్రభుత్వం చెప్పిన విధంగా 33 శాతం లాభాలు పంచితే మొత్తంగా దాదాపు రూ.1550 కోట్లు కార్మికులకు రావాల్సి ఉన్నది. లాభాలేమో రూ.4,701 కోట్లు చూపించి, కేవలం రూ.2,412 కోట్లలో 33 శాతం బోనస్‌ను ప్రకటించడం కార్మికుల కష్టాన్ని దోచుకోవడమే! కార్మికులకు న్యాయంగా అందించాల్సిన మిగతా రూ.2,289 కోట్లకు బోనస్‌ను ఎగ్గొట్టడం కాంగ్రెస్ దగాకోరుతనానికి నిదర్శనం.

కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి సింగరేణి కార్మిక వ్యతిరేక చర్యలకే పాల్పడ్డది. సమైక్య రాష్ట్రంలో 80, 90 దశకాల్లో యాజమాన్యానికి తొత్తులుగా వ్యవహరించి వేలాది మంది కార్మికులను అరిగోస పెట్టుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీది. ఉమ్మడి రాష్ట్రంలో కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తూ కార్మికులను బానిసలుగా మార్చిన యాజమాన్యానికి మద్దతుగా నిలిచింది ఆనాటి కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీ. కార్మికుల రక్షణ గాలికి వదిలేసి గనులలో ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టని కారణంగా అనేక సందర్భాల్లో గనులలో కార్మికులు సజీవ సమాధి అయితే అమానవీయంగా వ్యవహరించి యాజమాన్యానికి మద్దతుగా నిలిచింది కాంగ్రెస్ పార్టీ. ఏండ్ల తరబడి ఎటువంటి ప్రమోషన్లు ఇవ్వకుండా కార్మికుల శ్రమ దోపిడి చేసింది. ఏండ్లకేండ్లుగా వేజ్ బోర్డులను ఆలస్యం చేసి కార్మికులను ఆర్థిక దోపిడికి గురి చేసింది. వారసత్వ ఉద్యోగాలు రద్దు చేస్తూ యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్న సందర్భంలో మద్దతుగా నిలిచాయి కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ. ఓపెన్ కాస్ట్ మైనింగ్‌కు ఒప్పుకొని లక్షకు పైగా ఉన్న కార్మికుల సంఖ్యను 40 వేలకు కుదించింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం. నేడు అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలోనే కార్మికులకు న్యాయంగా చెల్లించాల్సిన బోనస్‌ను 50 శాతానికి తగ్గించి కార్మికులపై తనకున్న అక్కసును మరొక్కసారి వెళ్లగక్కింది రేవంత్‌రెడ్డి సర్కార్.

పదేండ్ల కేసీఆర్ పాలనలో సింగరేణికి స్వర్ణయుగం అనే చెప్పాలి. కార్మిక సంక్షేమంతో పాటు, సంస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం వల్ల సింగరేణి అద్భుత ప్రగతిని సాధించింది. దీనిద్వారా సింగరేణిలో లాభాలు గణనీయంగా పెరగడంతో అందుకు అనుగుణంగా కార్మికుల వాటాను పెంచుతూ కార్మిక పక్షపాతిగా నిలిచారు కేసీఆర్. ఉమ్మడి రాష్ట్రంలో నష్టాలే తప్ప లాభాలు చవిచూడని సంస్థను లాభాల బాటలో పయనించేలా చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే రూ.400 కోట్ల లాభాలు గడించేలా చేసింది. ఇప్పుడు అంచెలంచెలుగా రూ.4000 కోట్లకు పైగా చేరిందంటే అది కేసీఆర్ కృషినే. ఉమ్మడి రాష్ట్రంలో 1999-2014 వరకు 376 కోట్లు లాభాలు మాత్రమే కార్మికులకు పంచగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.2,780 కోట్లు కార్మికులకు అందించారు.

**ఇక కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికుల పట్ల, సంస్థ పట్ల ఎలా వ్యవహరిస్తుందో కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. సింగరేణి సంస్థ మనుగడనే బొగ్గు తవ్వకంపై ఆధారపడి ఉంటుందన్నది అందరికీ విదితమే. అలాంటి సంస్థ అభివృద్ధి చెందాలంటే ఎప్పటికప్పుడు కొత్త బొగ్గు బ్లాక్‌లను కేంద్రం కేటాయించాల్సి ఉంటుంది. అలాంటి లాభాల్లో ఉన్న సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బ్లాకులను కేటాయించకపోగా సంస్థకు చెందిన నాలుగు బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడం ద్వారా సంస్థ ఉత్పత్తిపైన పెనుభారం పడనున్నది.**

బొగ్గు ఉత్పత్తి లేని సింగరేణి సంస్థ బతుకు లేదు కనుక తెలంగాణకు ఆర్థిక, సామాజిక జీవనాడి లాంటి సింగరేణిని దెబ్బకొట్టి తెలంగాణను చీకటిమయం చేయాలని చూస్తుంది కేంద్ర బీజేపీ ప్రభుత్వం. అయినప్పటికీ సింగరేణి ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చీకటి ఒప్పందాలతో మిలాఖత్ అయ్యాయి. కేంద్ర బొగ్గు గనుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బొగ్గు గనుల వేలం ప్రక్రియలో సాక్షాత్తు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనడమే దీనికి నిదర్శనం.

2023 నవంబర్ 12న ప్రధాని మోదీ రామగుండం పర్యటన సందర్భంగా సింగరేణిని ప్రైవేటీకరించబోమని పట్టపగలు పచ్చి అబద్ధాలాడారు. నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్రంపైన, తెలంగాణ ప్రజల పైన మొదటి నుంచి విషం కక్కుతున్నారు. లాభాల్లో ఉన్న సింగరేణి సంస్థను దెబ్బ కొట్టి తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బకొట్టాలని చూసిన కేంద్ర ప్రభుత్వ దుర్మార్గపు నిర్ణయాన్ని ముందే పసిగట్టిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు 2021, డిసెంబర్ 7న సుమారు 450 మిలియన్ టన్నులకు పైగా బొగ్గు నిల్వలున్న కేకే6 అండర్ గ్రౌండ్ గని, శ్రావణపల్లి ఓసీ బ్లాక్, సత్తుపల్లి వద్ద గల జేవీఆర్ ఓసీ-3, కోయగూడెం ఓసీ 3 బ్లాకులను తమకే కేటాయించాలని ప్రధాని మోదీకి లేఖ రాసినా పట్టించుకున్న పాపాన పోలేదు. అంతేకాకుండా సింగరేణి కార్మికుల ఇన్కమ్ ట్యాక్స్ మాఫీపై తెలంగాణ ఏర్పడిన మొట్టమొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే కేసీఆర్ తీర్మానం చేసి కేంద్రానికి పంపినా అతీ గతీ లేదు. వాస్తవానికి సింగరేణి ప్రైవేటీకరణపై బీజేపీ చేస్తున్న కుట్రలు ఈరోజువి కావు. 1997లో కేంద్రంలో ఉన్న వాజపేయి సర్కార్ ఎల్‌పీజీ (లిబరలైజ్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) చర్యలను వేగవంతం చేస్తూ క్యాప్టివ్ మైన్స్ సిస్టం ద్వారా సింగరేణి ప్రైవేటుపరం చేయాలని పావులు కదిపారు. ఉద్యమ నాయకుడే రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఉండటంతో ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం సింగరేణి వైపు చూడటానికి కూడా సాహసించలేదన్నది ముమ్మాటికీ నిజం.

నేల తల్లి గర్భంలో ప్రకృతికి విరుద్ధంగా అండర్ గ్రౌండ్‌లో ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న అండర్ గ్రౌండ్ కార్మికుల అలవెన్స్ 12 శాతం మీద ఏటా రూ.లక్ష ఇస్తే అందులో రూ.10 వేలకు మాత్రమే ఇన్కమ్‌టాక్స్ మినహాయింపు ఇవ్వడం అత్యంత బాధాకరం. సింగరేణి క్వార్టర్ కలిగిన కార్మికుడి జీతంపైన పెర్క్‌టాక్స్‌ను కోల్ ఇండియాలో అమలుచేస్తున్న విధంగా సింగరేణిలో కూడా యాజమాన్యమే చెల్లించాలని కార్మికులు ఏండ్లుగా కోరుతున్నా పెడచెవిన పెట్టారు.

సింగరేణి ప్రైవేటీకరిస్తే వచ్చే పరిణామాలు చాలా దారుణంగా ఉంటాయి. సింగరేణికి-ప్రైవేట్‌వాళ్లకు బొగ్గు అమ్మకాల్లో పోటీ పెరుగుతుంది. ప్రైవేటు మాఫియా వారు కార్మికుల శ్రమను దోపిడి చేస్తారు. కార్మికుల రక్షణకు, పర్యావరణానికి ప్రైవేట్ మాఫియా ప్రాధాన్యం ఇవ్వవు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ కూడా పాటించరు. కొత్త గనులు రావు. వారసత్వపు ఉద్యోగాలు ఉండవు. గనులు మూతపడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. కార్మికులకు న్యాయంగా అందవలసిన హక్కులు, బోనస్‌లు, అలవెన్స్‌లకు గండి కొడతారు. దేశ సంపద ప్రైవేట్ చేతుల్లోకి వెళ్తే వారు మాత్రమే అభివృద్ధి చెందుతారు. దీని వల్ల సామాన్యులకు ఒరిగేదేమీ లేదు. కొద్ది రోజుల్లోనే సింగరేణి సంస్థ కనుమరుగవుతుంది.

సింగరేణి అభిమాన సంస్థ. నాడు, నేడు, ఏనాడైనా సింగరేణి సంస్థను కాపాడాలన్న, కార్మికులను కడుపున పెట్టుకుని చూసుకోవాలన్నా ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యం. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన అనంతరం సింగరేణికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందించింది. అందులో ముఖ్యంగా వారసత్వ ఉద్యోగాలు, కార్మికుల తల్లిదండ్రులకు కూడా కార్పొరేట్ వైద్యం, 26 వారాల మెటర్నిటీ లీవ్, అన్ని మతాల పండుగలకు పెయిడ్ హాలిడే, ఐఐటీ, ఐఐఎంలలో సీటు సంపాదించిన కార్మికుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇల్లు కట్టుకునే వారికీ రూ.10 లక్షలు వడ్డీ లేని రుణం, జీవో-76 ద్వారా సింగరేణి ఏరియాలో నివసించే వారికి పట్టాల పంపిణీ, ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉచితంగా మంచి నీటి సరఫరా, ఉచితంగా ఎలక్ట్రిసిటీ.. సింగరేణి క్వార్టర్లు, డ్యూటీలో చనిపోయిన కార్మికుడికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైర్మెంట్ వయస్సు 61కి పెంపు సింగరేణి కార్మికుల పిల్లలకు మెడికల్ సీట్లలో 5 శాతం కోటా, రామగుండం మెడికల్ కాలేజీలో 7 సీట్లు సింగరేణి కార్మికుల పిల్లలకే కేటాయించడం, సిమ్స్ అనుబంధంగా ఏర్పాటుచేస్తున్న దవాఖానలో 50 పడకలు సింగరేణి కార్మికులకు రిజర్వ్ చేయడం.. ఇలా అనేక కార్మిక సంక్షేమ పథకాలు అందించిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది.

ఇప్పటికే 10 నెలల కాలంలో పాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ఇప్పుడు కార్మికులకు లాభాల వాటలో 50 శాతం కోత విధిస్తూ తీవ్ర అన్యాయం చేసింది కార్మిక ద్రోహి కాంగ్రెస్ సర్కార్. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలు రూ.2,222 కోట్లు అయితే దీనిలో 32 శాతం అనగా దాదాపు రూ.710 కోట్లు కార్మికులకు అందించారు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా కార్మికులకు చెల్లించినట్టుగానే లాభాల్లో వాటా చెల్లించాలి. మొత్తం రూ.4,701 కోట్లలో 33 శాతం బోనస్‌గా ప్రకటించాలి. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో ఎంతో కీలకంగా ఉన్న సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. కేసీఆర్ నాయకత్వంలో కార్మికుల పక్షాన ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటుంది.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ నాయకులు)

**పదేండ్ల కేసీఆర్ పాలనలో సింగరేణికి స్వర్ణయుగం అనే చెప్పాలి. కార్మిక సంక్షేమంతో పాటు, సంస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడం వల్ల సింగరేణి అద్భుత ప్రగతిని సాధించింది. తత్ఫలితంగా సింగరేణిలో లాభాలు గణనీయంగా పెరగడంతో అందుకనుగుణంగా కార్మికుల వాటాను పెంచుతూ కార్మిక పక్షపాతిగా నిలిచారు కేసీఆర్.**